## ప్రజావాణి.. 5 వినతులు




**చందానగర్ :** చందానగర్ సర్కిల్- 21 కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో 05 వినతిపత్రాలు అందాయని ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 1 టౌన్‌ప్లానింగ్, 1 రెవెన్యూ, 1 శానిటేషన్, 02 ఇంజనీరింగ్ విభాగాలకు సంబంధించినవి కాగా వెంటనే పరిష్కరించాలని డీసీ మోహన్‌రెడ్డి అధికారులను ఆదేశించారు.

**శేరిలింగంపల్లి సర్కిల్‌లో ..**



**శేరిలింగంపల్లి:** శేరిలింగంపల్లి సర్కిల్‌లో డిప్యూటి కమిషనర్ ముకుంద్‌రెడ్డి అధ్యక్షతన జరిగిన ప్రజావాణి కార్యక్రమంలో 2 ఫిర్యాదులు అందాయి. ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాలకు ఒక్కొక్క దరఖాస్తు వచ్చినట్లు వివరించారు. ఏఎంసీ ప్రేమ్‌కుమార్, అర్బన్ బయోడైవర్సిటీ మేనేజర్ యూసుఫ్ పాల్గొన్నారు.

## ప్రత్యేక పూజలు



**రాయదుర్గం:** సోమావతి అమావాస్యను పురస్కరించుకొని గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో సోమవారం ప్రత్యేక పూజలు చేశారు. కాశీ విశ్వేశ్వరస్వామికి అర్చనలు, అభిషేకాలు చేశారు. రుద్రాక్షలతో ప్రత్యేక అలంకారం చేశారు. పెద్ద సంఖ్యలో భక్తులు స్వామివారిని దర్శించుకున్నారు.

## ట్రేడ్ లైసెన్స్ రెన్యూవల్ తప్పనిసరి

ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి



**చందానగర్ :** చందానగర్ సర్కిల్ -21 పరిధిలో ట్రేడ్ లైసెన్స్ పునరుద్ధరణ తప్పనిసరి అని ఉపకమిషనర్ మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యాపారులు కొత్త లైసెన్స్‌ల కోసం ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. చందానగర్ సర్కిల్ 21 పరిధిలో 7,817 ట్రేడ్ లైసెన్స్‌లు ఉన్నాయని, దీనిలో 1559 ట్రేడర్స్ రెన్యూవల్ చేసుకోవాల్సి ఉందన్నారు. మంగళవారం సాయంత్రంలోపు పునరుద్ధరించుకోవాలన్నారు. రెన్యూవల్ చేసుకోకుండా వ్యాపారాలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు.

## నివాళి



సుధీర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న డీసీ మోహన్‌రెడ్డి, అధికారులు

**చందానగర్ :** చందానగర్ సర్కిల్ 21 కార్యాలయంలో ఏఎంసీ సుధీర్‌కు సోమవారం డీసీ మోహన్‌రెడ్డి, వివిధ విభాగాల అధికారులు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుధీర్ మృతి బాధకరమన్నారు. కార్యక్రమంలో ఏఎంసీ కృష్ణ, విజయ్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ నాగిరెడ్డి, ఏఎంహెచ్ఓ డాక్టర్ రవి, సిబ్బంది పాల్గొన్నారు.

## దోభీఘాట్‌ను పరిశీలించిన ఎమ్మెల్యే

**కూకట్‌పల్లి:** బాలాజీనగర్ డివిజన్ పరిధిలోని కేపీహెచ్‌బీ కాలనీ రోడ్డు నంబర్- 1లోని దోభీఘాట్‌ని కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, మాజీ కార్పొరేటర్ పగుడాల బాబురావు, అధికారులతో కలిసి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఘాట్‌ను అత్యాధునిక హంగులతో మోడ్రన్ దోభీఘాట్‌గా తీర్చిదిద్దాలన్నారు. అలాగే నాయీ బ్రాహ్మణ సంఘ భవనం పనులు, నాలా ప్రహరీ పనులను త్వరగా పూర్తి చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో జీహెచ్‌ఎంసీ అధికారులు డీఈ శంకర్, ఏఈ శ్రీనివాస్, రజక సంఘం సభ్యులు, నాయీ బ్రాహ్మణ సంఘం సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రుణాల పంపిణీ

**శంషాబాద్ రూరల్:** మండల పరిధిలోని చిన్న గోల్కొండ సొసైటీ ఆధ్వర్యంలో వ్యవసాయ రుణాలను రైతులకు సోమవారం పంపిణీ చేశారు. చైర్మన్ బి.దౌనాకర్‌గౌడ్ చేతుల మీదుగా రైతులకు దీర్ఘకాలిక, స్వల్పకాలిక రుణాలు రూ. 31.90 లక్షలకు సంబంధించిన చెక్కులను అందజేశారు. అనంతరం నూతన సంవత్సరం కేలండర్‌ను ఆవిష్కరించారు. డైరెక్టర్లు, రైతులు పాల్గొన్నారు.

# ఇది పార్కేనా..

కనిపించని వాకింగ్‌ట్రాక్.. పని చేయని పవర్‌బోర్

- కూలిన ప్రహరీ.. కనిపించని లైటింగ్
- ఎక్కడ చూసినా గడ్డి, క్రిమికీటకాలు, పాములకు ఆవాసం
- లక్ష్మీవిహార్ ఫేజ్-1 కాలనీ పార్కు దుస్థితి



**శేరిలింగంపల్లి:**

జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో లక్షలాది రూపాయలతో అభివృద్ధి చేసిన పార్కు అస్తవ్యస్తంగా మారింది. కాలనీవాసులు పార్కులో కాలు మోపాలంటే జంకుతున్నారు. జీహెచ్‌ఎంసీ అర్బన్ బయోడైవర్సిటీ అధికారుల నిర్లక్ష్యం కారణంగా పార్కుల నిర్వహణ అధ్వానంగా మారిందనే విమర్శలు వస్తున్నాయి. గచ్చిబౌలి డివిజన్‌లోని లక్ష్మీవిహార్ ఫేజ్-1 కాలనీలోని పార్కు నిర్వహణను పట్టించుకోకపోవడంతో ఈ పరిస్థితి నెలకొందని స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

- పార్కులో వాకింగ్‌ట్రాక్ గడ్డి, ఎండిన ఆకులతో నిండిపోయింది.
- దీంతో కాలనీవాసులు పార్కులోకి రావాలంటే భయపడుతున్నారు. పాముల సంచారంతో ఇటువైపు రావడం లేదు.
- పార్కులో పవర్ బోరు పనిచేయడం లేదు. దీంతో చెట్లకు నీరు అందడం లేదు.
- పార్కులో చిల్డ్రన్ ప్లే ఏరియాలో ఆట వస్తువులు వినియోగంలో లేకపోవడంతో తుప్పుపట్టాయి
- పార్కు ప్రహరీగోడ ధ్వంసం అయింది. పార్కు పూర్తిగా గడ్డితో నిండిపోవడంతో క్రిమికీటకాలు తిరుగుతున్నాయి
- పార్కు నిర్వహణపై అర్బన్ బయోడైవర్సిటీ అధికారులు దృష్టి సారించాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు.
- గ్రీనరీ పెంపుదల, లైటింగ్ సౌకర్యం, వాకింగ్ ట్రాక్‌ను అందుబాటులోకి తేవాలని స్థానికులు పేర్కొంటున్నారు.



లక్ష్మీవిహార్ ఫేజ్-1 కాలనీ పార్కులో వాకింగ్ ట్రాక్‌లో చెత్త చెదారం



తుప్పుపట్టిన ఆట పరికరాలు



## టెలికామ్‌నగర్ పార్కును అభివృద్ధి చేయాలి

జోనల్ కమిషనర్‌ను కలిసిన కాలనీవాసులు




జెడ్సీ ఉపేందర్‌రెడ్డికి వినతిపత్రం ఇస్తున్న కాలనీవాసులు

**రాయదుర్గం:** టెలికామ్‌నగర్‌లోని జీహెచ్‌ఎంసీ పార్కు(పార్కు-3)ని మరింత అభివృద్ధి చేయాలని కోరుతూ ఆ కాలనీవాసులు జీహెచ్‌ఎంసీ వెస్ట్‌జోన్ శేరిలింగంపల్లి జోనల్ కమిషనర్ ఉపేందర్‌రెడ్డికి సోమవారం వినతిపత్రం అందజేశారు. పార్కులో పాములు, విష కీటకాలు సంచరిస్తున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. పార్కులో ఉత్తరం వైపు చెట్లు ఏపుగా పెరిగాయని .. వాకింగ్ ట్రాక్‌ను విస్తరించడంతో బాటు ఎత్తు పల్లాలను సరి చేయించాలని కోరారు. పరిసరవాసులు వృథా నీటిని వాకింగ్ ట్రాక్ పైకి వదులుతున్నారని దీన్ని అరికట్టాలని.. ప్రహరీగోడ ఎత్తు పెంపు, డస్ట్‌బిన్ల ఏర్పాటు చేయాలని విన్నవించారు. పార్కులో సినిమా షూటింగ్‌లు సైతం నిర్వహిస్తుంటారని, మరింత శ్రద్ధ తీసుకోవాలన్నారు. అనంతరం ఆయన పార్కు అభివృద్ధికి తగిన చర్యలు తీసుకుంటామని, అధికారులు పరిశీలించి తగిన చర్యలు తీసుకుంటారని హామీ ఇచ్చారు. జెడ్సీని కలిసిన వారిలో రవీందర్ రెడ్డి, బన్సాల్, రామకృష్ణ, దినేష్‌యాదవ్, రంగస్వామి, రవీందర్‌రెడ్డి, మురళీధర్‌రావు తదితరులు ఉన్నారు.

## ప్రమాదకరంగా మ్యాన్‌హోళ్లు



మియాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం రోడ్డులో ధ్వంసమైన మ్యాన్‌హోల్

**మియాపూర్:** అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించకపోవడంతో త్వరగా పాడవుతున్నాయి. మియాపూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం రోడ్డులో కృషినగర్ వద్ద మ్యాన్‌హోళ్లు పాడయ్యాయి. గత నెలలో మ్యాన్‌హోళ్లు ఏర్పాటు చేసి సీసీ రోడ్డు వేశారు. మ్యాన్‌హోల్స్ నిర్మాణ పనుల్లో నాణ్యత లేకపోవడంతో మూతలు ధ్వంసమై ప్రమాదకరంగా మారాయి. అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో కాంట్రాక్టర్లు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారని ప్రజలు అంటున్నారు. ప్రధాన రోడ్డు వెంబడి మ్యాన్‌హోళ్లు పాడవడంతో ఎపుడు ప్రమాదం జరుగుతుందోనని వాహనదారులు భయాందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించాలని స్థానికులు కోరుతున్నారు.

## విద్యార్థులు పరిశోధనలపై దృష్టి పెట్టాలి

**పటాన్‌చెరు టౌన్:** విద్యార్థులు పరిశోధనల వైపు దృష్టి సారించాలని కళాశాల విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ డీఎస్ఆర్ రాజేందర్ సింగ్ సూచించారు. ఏపీజే అబ్దుల్ కలాం ప్రభుత్వ డిగ్రీ కళాశాల పటాన్‌చెరులో ఒకరోజు జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టుపై నిర్వహించిన ఒకరోజు వర్క్‌షాప్‌నకు ముఖ్యఅతిథిగా హాజరై విద్యార్థులకు దిశా నిర్దేశం చేశారు. విద్యార్థులను ఉద్దేశించి మాట్లాడుతూ... విద్యార్థులు నూతన అంశాలపై దృష్టి సారించి పరిశోధనల వైపు అడుగు పెట్టాలని సూచించారు. నూతన ఆవిష్కరణల వైపు చూడాలని సూచించారు. కళాశాల విద్యాశాఖ రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ కళాశాలలో జిజ్ఞాస స్టూడెంట్ స్టడీ ప్రాజెక్టులపై కాంపిటీషన్స్ ను నిర్వహిస్తున్నారని దానికి అనుగుణంగా రీసెర్చ్ మెథడాలజీ పై అవగాహన కార్యక్రమాన్ని, ప్రాజెక్టు తయారు చేసే విధివిధానాలను చెప్పడానికి ఆలోచించడానికి కావలసిన సమాచారాన్ని అందివ్వడానికి ఇలాంటి కార్యక్రమాలు తోడ్పడతాయని సూచించారు. ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో విద్యార్థులు పరిశోధనలు ముందుండాలని అన్ని కళాశాల కన్నా ముందుండాలని ప్రొఫెసర్ బాల భస్కర్ అకాడమిక్ గైడెన్స్ ఆఫీసర్ కోరారు.కళాశాల విద్యార్థులకు కార్యశాల మరింత ప్రయోజనకరమై భవిష్యత్ తరాలకు పరిశోధనల వైపు మళ్ళించడానికి తమ కళాశాల కృషి చేస్తుందని ప్రిన్సిపాల్ డాక్టర్ వడ్లురి శ్రీనివాస్ తెలిపారు.ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్. శ్రీనివాస్, వైస్ ప్రిన్సిపాల్ ప్రవీణ, రీసెర్చ్ కమిటీ కోఆర్డినేటర్ డాక్టర్ సుజాత, డాక్టర్ యోగిబాబు, డాక్టర్ మల్లిక, డాక్టర్ వెంకటేశం, డాక్టర్ పూనం కుమారి ,సిబ్బంది పాల్గొన్నారు.

## అనారోగ్యంతో యువకుడు మృతి



నబీ (ఫైల్)

**మియాపూర్:** అనారోగ్యంతో యువకుడు మృతి చెందిన సంఘటన మియాపూర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్ఐ రాజేశ్వర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. బిహార్ రాష్ట్రానికి చెందిన సాకీబ్ రెహాన్ నబీ(25) నెల రోజుల కిందట నగరానికి వచ్చి హఫీజ్‌పేట్ ఆదిత్య నగర్ రోడ్డు నంబర్-5లో ఐదు మంది స్నేహితులతో కలిసి ఉంటున్నాడు. స్థానికంగా చిరు వ్యాపారం చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ క్రమంలో గత మూడు రోజులుగా నబీ దగ్గు, జ్వరంతో బాధపడుతున్నాడు. ఆదివారం ఉదయం స్నేహితులు టాబ్లెట్ వేసి టీ, బిస్కెట్ ఇచ్చి వెళ్లిపోయారు. అదే రోజు రాత్రి 10 గంటల సమయంలో స్నేహితుడు జిక్రుల్లా వచ్చి చూసేసరికి నబీ అపస్మారకస్థితిలో ఉండగా కొండాపూర్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. డాక్టర్లు పరిశీలించి నబీ మృతి చెందినట్లు తెలిపారు. మియాపూర్ పోలీసులకు సమాచారం అందించడంతో పోలీసులు వెళ్లి పరిశీలించారు. స్నేహితుడి ఫిర్యాదు మేరకు మియాపూర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## మనూలో హిమాచల్‌ప్రదేశ్ బృందం



**రాయదుర్గం:** ఏక్ భారత్.. శ్రేష్ఠ భారత్ (ఈబీఎస్‌బీ) కింద హిమాచల్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన విద్యార్థులు, యువకులతో కూడిన బృందం సోమవారం ఉదయం ఉర్దూ విశ్వవిద్యాలయం క్యాంపస్‌కు చేరుకున్నారు. అరేబియా సాంప్రదాయంతో, రిథమిక్ డ్రమ్‌తో వారికి స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మనూ అధికారులు దక్కన్ చరిత్ర, సాంస్కృతిక ప్రాముఖ్యత, సాంప్రదాయాలు, ఉర్దూ సాహిత్యం, కళల గురించి వివరించారు. అనంతరం క్యాంపస్‌లోని వివిధ ప్రాంతాలను సందర్శించారు.

## రమణీయం..



**మాదాపూర్:** శిల్పారామంలో నిర్వహిస్తున్న చేనేత హస్తకళా ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంటోంది. అలాగే సాంస్కృతిక కార్యక్రమాలలో భాగంగా సోమవారం డాక్టర్ సత్యప్రియ రమణ శిష్యబృందంచే కూచిపూడి నృత్య ప్రదర్శనలో ప్రార్థన, సిద్ధి వినాయకం, పద్మావతి ప్రవేశం, బాలకనకమయ, గోవర్ధన గిరిధరి, అయిగిరినందిని, ముద్దుగారే యశోద, తిల్లాన, మంగళం తదితర అంశాలను కామాక్షి, విజయ, నిఖిల, శ్రీయ, వకుళ, రమ్య, శ్రీష్టి తదితరులు ప్రదర్శించారు. వైదేహి సుభాష్ శిష్యబృందం భరతనాట్య ప్రదర్శన ఇచ్చారు.



## పార్కు నిర్మాణానికి కృషి

**ఆల్విన్‌కాలనీ:** పార్కు నిర్మాణానికి కృషి చేస్తానని ఆల్విన్‌కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేశ్‌గౌడ్ అన్నారు. కూకట్‌పల్లి, ఆల్విన్‌కాలనీ ఫేజ్-2 శివాలయం వెనుక వీధిలో ఆల్విన్ హౌసింగ్ సొసైటీ ఆధ్వర్యంలో కాలనీలో పార్కు కోసం కేటాయించిన స్థలాన్ని జేసీబీతో సోమవారం చదును చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. జీహెచ్‌ఎంసీ అధికారులతో త్వరలో సమావేశమై ప్రణాళికలు రూపొందించి నిధులు మంజూరయ్యేలా చూస్తానన్నారు. అదేవిధంగా షటిల్ కోర్టు కూడా ఏర్పాటయ్యేలా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కార్యక్రమంలో ఆల్విన్ హౌసింగ్ సొసైటీ జనరల్ సెక్రటరీ భాస్కర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ సమ్మారెడ్డి, సాయి ప్రభాకర్, ఇస్మాయిల్, శివరాజుగౌడ్, కాలనీ వాసులు ఉన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

**చందానగర్ :** వేమనకాలనీ సబ్‌స్టేషన్ పరిధిలోని 11 కేవీ ఫీడర్ల పరిధిలో విద్యుత్ మరమ్మతుల కారణంగా మంగళవారం విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు ఏఈ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు.

- భవానీపురం ఫీడర్ పరిధిలో.. ఉదయం 10.00 గంటల నుంచి మధ్యాహ్నం 1.00 గంట వరకు భవానీపురం, రెడ్డి కాలనీ, వీకర్ సెక్షన్ కాలనీ, శంకర్‌నగర్ ఏరియాలలో విద్యుత్ సరఫరా ఉండన్నారు.
- ఫ్రెండ్స్ కాలనీ ఫీడర్ పరిధిలో.. ఫ్రెండ్స్ కాలనీ, శిల్పా ఎన్‌క్లేవ్, అర్జున్‌రెడ్డి కాలనీ, వెస్ట్ మెట్రో అపార్ట్‌మెంట్స్ ప్రాంతాలలో..
- సురక్ష ఫీడర్ పరిధిలో.. విద్యానగర్, సురక్ష ఎన్‌క్లేవ్, రాజేందర్‌రెడ్డి నగర్, సత్య ఎన్‌క్లేవ్, శుభోదయ కాలనీ, అపర్ణ హెచ్‌టీ సర్వీస్ ఏరియాలలో ..
- కెఎస్ఆర్ ఫీడర్ పరిధిలో.. కెఎస్ఆర్ ఎన్‌క్లేవ్, పీజేఆర్ రోడ్డు నెం.02, 04 ,06, 08 ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.
- కెఎస్ఆర్ ఎన్‌క్లేవ్ ఫీడర్ పరిధిలో. మధ్యాహ్నం 2.00 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు పీజేఆర్ రోడ్డు నం.1,3,5,7,10,12, లగ్జరీ అపార్ట్‌మెంట్ ఏరియాలలో...
- ఇక్రిశాట్ కాలనీ ఫీడర్ పరిధిలో.. గ్రీన్‌హిల్స్ అపార్ట్‌మెంట్స్, ఆర్వీ నిర్మాణ్ అపార్ట్‌మెంట్స్, ఇక్రిశాట్ కాలనీ ప్రాంతాలలో..
- జనప్రియ నైల్ వ్యాలీ ఫీడర్ పరిధిలో.. జనప్రియ టౌన్‌షిప్స్ ప్రాంతాలలో విద్యుత్ సరఫరా ఉండదన్నారు.

**మియాపూర్‌లో..**

**మియాపూర్ :** మీ సేవా ఫీడర్, ఎస్ఆర్ ఎస్టేట్ ఫీడర్, పీఎస్ఆర్ హిల్స్, ఆర్టీసీ కాలనీ ఫీడర్ మరమ్మత్తుల కారణంగా విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఏఈ శ్రీనివాస్ ఓ ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 2 గంటల వరకు ఎస్ఆర్ఎంఆర్ మెట్రో పొలిస్, మియాపూర్ గ్రామం, పొట్లపల్లి అపార్ట్‌మెంట్, వడ్డెర బస్తీ, మధ్యాహ్నం 2 గంటల నుండి సాయంత్రం 5 గంటల వరకు హెచ్‌ఎంటీ కాలనీ రోడ్డు నంబర్ -22 శిల్పా ఎస్టేట్, ఆర్టీసీ కాలనీ, గ్రేటర్ ఇన్నా ప్రాంతాలలో విద్యుత్ ఉండదని తెలిపారు.

## స్టడీ మెటీరియల్ పంపిణీ



స్టడీ మెటీరియల్‌ను అందజేస్తున్న బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవికుమార్‌యాదవ్

**శేరిలింగంపల్లి:** ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల అభ్యున్నతి కోసం రెండు దశాబ్దాలుగా సందయ్య మెమోరియల్ ట్రస్ట్ కృషి చేస్తుందని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవికుమార్ యాదవ్ తెలిపారు. సందయ్య మెమోరియల్ ట్రస్ట్, ఆర్.కే.వై ఫౌండేషన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో లింగంపల్లి, శేరిలింగంపల్లి జిల్లా పరిషత్ హైస్కూల్స్ పదో తరగతి విద్యార్థులకు సోమవారం స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. కార్యక్రమంలో కంటెస్టెడ్ కార్పొరేటర్ కె.ఎల్లేష్, బీజేపీ నాయకులు శ్రీనివాస్, ఆకుల లక్ష్మణ్, రాజేష్, రవికాంత్, పద్మ, విజయలక్ష్మి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## సమస్యలు పరిష్కరించాలంటూ ఆందోళన



చందానగర్ సర్కిల్ కార్యాలయం వద్ద నిరసన తెలుపుతున్న చెత్త ఆటోల కార్మికులు

**చందానగర్ :** చందానగర్ సర్కిల్ 21 పరిధిలో సమస్యలను పరిష్కరించాలంటూ సోమవారం చెత్త ఆటోల కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దీప్తిశ్రీనగర్‌లోని చెత్త డంపింగ్ యార్డులో తడి, పొడి చెత్తను వేరు చేసే విధానానికి అనుమతి ఇవ్వాలని, ఇంటింటికి చెత్త సేకరణకు రూ.50 నుంచి రూ.100 పెంచాలని, వివిధ సర్కిళ్ల నుంచి చెత్త ఆటోలు డంపింగ్ యార్డుకు రాకుండా చూడాలని ఉపకమిషనర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం డీసీ మోహన్‌రెడ్డి మాట్లాడుతూ చెత్త ఆటోలపై దీప్తిశ్రీనగర్ కాలనీవాసుల నుంచి పలు ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. కార్మికులు తడి పొడి చెత్తను ఇళ్ల వద్దనే వేరు చేసి డంపింగ్ యార్డుకు తీసుకురావాలన్నారు. ఆటోలు నడిపే వారికి డ్రైవింగ్ లైసెన్స్ ఉండాలని, చిన్న పిల్లలను డంపింగ్ యార్డు వద్దకు తీసుకురావద్దన్నారు. త్వరలోనే డంపింగ్ యార్డు వద్ద పోలీస్ ఔట్‌పోస్టు ఏర్పాటు చేసి చెత్త ఆటోలను తనిఖీలు చేయిస్తామన్నారు. యార్డు పరిసరాలు శుభ్రంగా ఉంచకపోతే జరిమానా విధిస్తామన్నారు. చెత్త ఆటోలకు హైడ్రాలిక్ పరికరం బిగించుకోవాలన్నారు.

## రోడ్డు విస్తరణ పనులను పరిశీలించిన జెడ్సీ



హెచ్‌సీయూ డిపో జంక్షన్ వద్ద రోడ్డు విస్తరణ పనులను పరిశీలిస్తున్న ఉపేందర్‌రెడ్డి తదితరులు

**శేరిలింగంపల్లి:** శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని హెచ్‌సీయూ డిపో జంక్షన్‌లో రోడ్డు విస్తరణ పనులను జీహెచ్‌ఎంసీ జోనల్ కమిషనర్ ఉపేందర్ రెడ్డి సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపేందర్ రెడ్డి మాట్లాడుతూ విస్తరణ పనుల్లో అడ్డుగా ఉన్న ఎలక్ట్రికల్ పోల్స్‌ను వెంటనే మార్చేందుకు చర్యలు చేపట్టాలని ఎలక్ట్రికల్ డీఈకి సూచించారు. పనుల్లో వేగం పెంచాలని ఇంజనీరింగ్ అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో డిప్యూటీ కమిషనర్ ముకుంద్‌రెడ్డి, ఎస్ఈ శంకర్, ఈఈ దుర్గా ప్రసాద్, డీఈ ఆనంద్, టీపీఎస్ రవీందర్, ఎలక్ట్రికల్ డీఈ కవిత తదితరులు పాల్గొన్నారు.

## మండలస్థాయి పోటీల్లో విద్యార్థినుల సత్తా



సర్టిఫికెట్ అందుకుంటున్న తాజీన్



బహుమతి అందుకుంటున్న అంజలి

**రాయదుర్గం:** శేరిలింగంపల్లి మండల పరిధిలో నిర్వహించిన పోటీ పరీక్షలలో రాయదుర్గం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థినులు తమ సత్తా చాటారు. గచ్చిబౌలిలోని జెడ్పీహెచ్ఎస్‌లో మండల స్థాయిలో 8వ తరగతి నుంచి పదవ తరగతి విద్యార్థులకు సోషల్ టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఇందులో రాయదుర్గంలోని జెడ్పీహెచ్ఎస్ స్కూల్‌లో పదవ తరగతి చదివే తాజీన్ మండల స్థాయిలో మొదటి స్థానం, అంజలి రెండవ స్థానాన్ని సాధించారు. వీరిద్దరినీ ప్రిన్సిపల్ ఎస్కే తాజ్‌బాబు, ఉపాధ్యాయ బృందం, విద్యార్థులు సోమవారం పాఠశాలలో అభినందించారు. పాఠశాలలో ఉపాధ్యాయుల సమిష్టి కృషి మంచి ఫలితాలనిస్తోందన్నారు.

## వీధి దీపాలు .. పగలూ వెలుగులు



భెల్ ఎంఐజీ కాలనీలో క్వార్టర్ నంబర్ 2069 లైన్‌లో వెలుగుతున్న వీధి దీపాలు



క్వార్టర్ నంబర్ 2050 లైన్‌లో ..



క్వార్టర్ నంబర్ 2293 లైన్‌లో..

**శేరిలింగంపల్లి:** శేరిలింగంపల్లి సర్కిల్‌లో వీధి దీపాలు నిరంతరాయంగా వెలుగుతున్నాయి. సంబంధిత అధికారులు పట్టించుకున్న దాఖలాలు లేవనే విమర్శలు వస్తున్నాయి. భారతినగర్ డివిజన్ పరిధిలోని భెల్ ఎంఐజీ కాలనీలో పలు రోడ్లలో లైట్లు పగలు, రాత్రి తేడా లేకుండా వెలుగుతుండటంతో విద్యుత్ దుబారా అవుతోంది. జీహెచ్‌ఎంసీ ఎలక్ట్రికల్ విభాగం అధికారుల పర్యవేక్షణ కొరవడటంతో ఈ సమస్య పునరావృతం అవుతున్నా చర్యలు తీసుకోవడం లేదని అంటున్నారు. ఇప్పటికైనా వీధి దీపాల నిర్వహణపై దృష్టి సారించాలని స్థానికులు కోరుతున్నారు.